# తెలంగాణలో వంద గొంతులు వినిపించాలి

వార్తలు రాయమంటే కథలు రాసి పంపిస్తే సంపాదకులు ఒప్పుకోరు. అందరి కథలూ అచ్చు వేయాలంటే ఎనిమిది పేజీల పేపరు ఎనభై పేజీలయినా సరిపోదని న్యాయంగానే అభ్యంతరం చెప్తారు. అయినా, అడ్వర్టైజ్‌మెంట్లు పోను, సినిమా బొమ్మలూ వ్యాఖ్యలూ పోను, రాజకీయ నాయకుల రచ్చలూ రగడలూ పోను కథలు అచ్చువేయడానికి పేపర్లో చోటెక్కడుంటుంది? పేజీలు ఎనిమిదయితేనేం ఎన్నయితేనేం?

ఉత్తర తెలంగాణలో పనిచేసే విలేఖర్లకు - ముఖ్యంగా చిన్న ఊర్లలో పనిచేసే గ్రామీణ విలేఖర్లకు - ఇంకొక ఫిర్యాదు కూడ ఉంది. తాము పంపించే వార్తల ప్రాముఖ్యాన్ని బేరీజు వేసే 'డెస్క్' సిబ్బందిలో అధిక భాగానికి ఆ నక్సలైట్ల కార్యక్షేత్రాన్ని గురించి, అక్కడి సమస్యల గురించి అంచనా ఉండదని. నిజానికి వారిలో చాలామంది తెలంగాణేతరులే. వాళ్ళకు నక్సలైట్లు ఒక్కొక్కసారి హింసోన్మాదులు గాను, ఒక్కొక్కసారి రొమాంటిక్ హీరోలుగాను, ఒక్కొక్కసారి దారి తప్పిన సోదరులుగాను, ఒక్కొక్కసారి తమ తుపాకులతో న్యాయాన్ని నిలబెట్టే అభినవ అవతార పురుషులుగాను కనిపిస్తారు. ఆ తెరలను ఛేదించుకొని అక్కడి ప్రజలనూ ప్రజా జీవితాన్ని చూడలేని వారు అక్కడి వార్తల ప్రాముఖ్యాన్ని అంచనా వేయలేరు. (ఆ తెరలు నెలకొనడంలో నక్సలైట్ల బాధ్యత కూడ లేకపోలేదు).

వార్త మాత్రం సేకరించి వచ్చేసే విలేఖరికి ఇదేదీ పెద్దగా బాధ కలిగించదు. అది 'సింగిల్ కాలం' వార్తా లేక 'డబుల్ కాలం' వార్తా

అని నిర్ధారించుకొని అంతమేరకు మాత్రమే విషయ సేకరణ చేసి పెన్నూ పుస్తకం మూసేసి లేచి వెళ్లిపోయే విలేఖరి మనసులో ఆనాటి వార్తలను బస్సెక్కించేసిన తరువాత వాటి అవశేషాలేమీ మిగలవు. ఆ విలేఖరి ధన్యజీవి అనుకోవచ్చు. అంత యాంత్రికమైనది ఒక జీవితమే కాదనుకోవచ్చు. మన దృష్టిని బట్టి ఏమైనా అనుకోవచ్చు.

కానీ మనుషుల కష్టసుఖాలు పేపర్లో ఒకటో రెండో 'కాలం'ల వార్తలుగా మారిపోవడం తప్పనిసరి అని గుర్తించినా, వాటిని తన మది నుండీ తన జ్ఞాపకాల నుండీ తరిమి వేయలేని విలేఖరి ఏం చేయాలి? తాను పని చేసేది మామూలు ప్రాంతం కానట్టయితే, బరువయిన కథలకు నిలయమైన ఆదిలాబాద్ బొగ్గు గనుల సీమ అయితే, మనసులో ఆ బరువును పెంచుకొని ఎన్నాళ్లు ఊరకుండాలి?

ఆ జ్ఞాపకాలు బద్దలై కథలు కాక తప్పదు. వాటిని కథకులకు చెప్పి రాయించవచ్చు. తానే కథా రచన అలవరచుకొని రాయవచ్చు. లేదా విన్నది విన్నట్టు - పేర్లు, స్థలాలు కొంచెం మార్చి (ప్రైవసీ మీద గౌరవం కొద్దీ కావచ్చు, పరువునష్టం దావాలంటే భయంకొద్దీ కావచ్చు, పోలీసోళ్లు సాహిత్యం సహితం చదువుతారన్న స్పృహకొద్దీ కావచ్చు) - రాసి, ఇదిగో నేను విలేఖరిగా రాయలేకపోయిన పూర్తి కథ ఇది అని మన ముందుంచవచ్చు.

మునీర్ ఈ చివరి మార్గం ఎంచుకున్నాడు. ముడిసరుకును కథగా మలచకుండా ముడిసరుకుగానే అందియ్యడాన్ని విమర్శించే వాళ్లుంటారు. ఇది కూడ ఒక సాహిత్య ప్రక్రియేనని విశ్లేషించే వాళ్లుంటారు. ఎవరేమనుకున్నా మునీర్ తన మనసులోని బరువు దించుకున్నాడు. రచయితలంతా నిజానికి ఈ పనే చేస్తారు. రచనకు సామాజిక ప్రయోజనాలు ఎన్నయినా ఉండవచ్చుగానీ రచన వల్ల రచయితకుండే ప్రయోజనం ఇది. సాహిత్యం స్వభావ స్వరూపాలను నిర్ణయించటంలో ఈ ప్రయోజనానికీ పాత్ర ఉంటుంది. అది సాహిత్యమా కాదా, అభ్యుదయమా కాదా అని తర్కించడం విమర్శకుల వంతు.

ఆదిలాబాద్ బొగ్గుగనుల జీవితంతో పరిచయం లేని వాళ్లు ఈ వార్తా కథనాలకు ఏ విధంగా స్పందిస్తారో చెప్పలేను. బాగా దూరంగా బ్రతికే వాళ్లను ఈ కథనాలు పెద్దగా కదిలించకపోవచ్చు. (రాజకీయ పక్షపాతం కదలిక వంటి అనుభూతి కొంత కలిగించవచ్చుననుకోండి.) అటువంటప్పుడు వాళ్ల కోసమైనా ఇంకెందు కోసమైనా మునీర్ తన కథనాన్ని తన నిత్య జీవిత భాషలో స్వచ్ఛంగా చెప్పకుండ తన వృత్తి కోసం తాను అలవరచుకున్న దినపత్రికల తెలుగుతో కలగలపి చెప్పడం అనవసరమేమో!

బొగ్గు బావుల జీవితంతో పరిచయం ఉన్న వాళ్లను ఈ వార్తా కథనాలు తప్పక కదిలిస్తాయి. తమ పరిచయాలనూ జ్ఞాపకాలనూ నెమరువేసుకునేటట్టు చేస్తాయి. ఊర్లనూ మనుషులనూ సంఘటనలనూ జ్ఞప్తికి తెస్తాయి.

పొద్దున్నా సాయంత్రం కార్మికుల ఇళ్లల్లో వంటలయిపోయేదాకా తెల్లటి మంచులాగ వీధులను కమ్మి ఉండే బొగ్గు పొయ్యిల పొగ, నెత్తిన హెల్మెట్ పెట్టుకొని బొగ్గుతో యుద్ధానికి పోతున్న సైనికుల లాగ బారులు తీరి సైకిళ్ల పైన డ్యూటీకి పోయే కార్మికుల గుంపులు, చేసిన శ్రమ అంతా అలసటై గొంతులో కూర్చున్నట్టు ముక్తసరిగా కరుకుగా మాట్లాడే వారి స్వరాలు, తెలంగాణ గ్రామీణ సంస్కృతికీ పెరిగిన జీతాల వల్ల మధ్యతరగతి పట్టణ సంస్కృతి అంచుకు చేరుకున్న జీవనశైలికీ పొంతన కుదరక వింత రూపం తీసుకుంటున్న కార్మిక జీవన సంస్కృతి ('గీ పోరి ఎటుపోయిందో' అని వెతికే తల్లికి 'మా ఫ్రెండ్ ఇంటికి పోయాను మమ్మీ' అని జవాబు చెప్పడం నేర్చుకుంటున్న ఈ తరం పిల్లలు), 'పెద్ద పోరడిని పనిలోన బెట్టినము గానీ గీ చిన్నోడు దాన్ల దీన్ల తిరుగుతాండు గదా పోలీసోల్ల చేతులల్ల గన పడుతడేమో' నన్న దిగులు, ఎన్‌కౌంటర్ వార్త వినగానే 'ఎవల్ల పోరడో'నని వాకబు చేసే ఆరాటం, ఎవరయినా ఎన్నడయినా తన్నకపోతారా అని తాము ఎదురు చూస్తున్న దుర్మార్గుడికి 'అన్నలు' దేహశుద్ధి చేసారని తెలిస్తే కళ్లలో వెలిగే సంతృప్తి, మిలిటెంట్ల దుందుడుకు చర్యల గురించి, 'అన్నల' అనాలోచితమైన నిర్ణయాల గురించి, రౌడీలుగా మారిన 'మాజీల' గురించి విరక్తిగా మాట్లాడుకునే పెదవి విరుపు మాటలు, యూనియన్ల పేరు చెప్తే విమర్శ, పోలీసుల ప్రస్తావన వస్తే ఛీత్కారం, 'అన్నల' మాట తీస్తే తగ్గు స్వరంతో ముక్తసరిగా మాట్లాడే రెండు మాటలు, 'అన్నలు గా చాకలి మల్లేశం కాల్రెక్కలిరగ్గొట్టిన్రంట' అంటే మౌనంగా దిక్కులు చూస్తూ టాపిక్ మార్చే దాకా ఊరకుండే ముఖాలు - ఇవీ ఇంకా ఎన్నో జ్ఞాపకం వస్తాయి.

బొగ్గు బావుల వర్తమాన స్థితిని గురించి పూర్తి చిత్రం ఇవ్వడానికి మునీర్ మరికొన్ని ప్రముఖమైన ఘటనల కథనాలు కూడ చేర్చి ఉండవచ్చును. చేర్చిన వాటిని ఇంకొక రకంగా కూడ వ్యాఖ్యానించి ఉండవచ్చును. మనం చూపించే సత్యం మనం ఎంపిక చేసుకునే ఘటనలను బట్టి, వాటిని మనం వ్యాఖ్యానించే పద్ధతిని బట్టి ఉంటుంది (నస్పూర్‌లో పోలీసులు సజీవంగా దహనం చేసిన సికాస నాయకుడు మాదిరెడ్డి సమ్మిరెడ్డి హత్యోదంతం అందరికీ తెలుసును. పోలీసుల క్రూరత్వం మీద దృష్టిపెట్టి ఆ ఘటనను వ్యాఖ్యానిస్తే మనకు ఒక వాస్తవం తెలుస్తుంది. చుట్టూ వందల సంఖ్యలో గుమిగూడి ఆ ఘోరకాండను అచేతనంగా చూస్తూ ఉండిపోయిన కార్మికుల మీద దృష్టిపెట్టి వ్యాఖ్యానిస్తే వేరే కొన్ని వాస్తవాలు తెలుస్తాయి).

అదెట్లాగున్నా ఈ కథనాలు మునీర్ మనసు నుండి పుట్టినవి. అతను చూపించదలచుకున్న దృశ్యం అతను మనస్ఫూర్తిగా నమ్మినది. ఈ కథనాలలోని పక్షపాతం ప్రదర్శన కోసం తెచ్చి పెట్టుకున్నది కాదు.

ఒక ప్రేక్షకుడిగా ప్రదర్శించేది కూడ కాదు. తాను నమ్మిన సత్యాన్నీ న్యాయాన్నీ నిస్సంకోచంగా కాగితం మీదికి ఎక్కించాలన్నదొక్కటే మునీర్ ఆరాటం కాదు (అదొక్కటే అయినా మెచ్చుకోవచ్చు). ఆ సత్యాన్నీ న్యాయాన్నీ కాపాడడానికి దైనందిన జీవితంలో కృషి చేయడం కూడ తన కర్తవ్యమేనని - విలేఖరిగానూ వ్యక్తిగానూ - మునీర్ నమ్మాడు. 'ఆ సంకల్పం ఉందంటేనే నువ్వొక నక్సలైటువన్నమాట' అన్న పోలీసుల బెదిరింపులకు లొంగకుండ అతను ఆ నమ్మకాన్ని ఆచరించే ప్రయత్నం చేసాడని ఈ కథనాలే చెప్తాయి.

ఉత్తర తెలంగాణలో న్యాయన్యాయాల గురించి గుసగుసలుగా మాట్లాడడానికి చాలామంది సిద్ధమే కానీ ఈ సంకల్పం మాత్రం కొద్దిమందిలో మాత్రమే ఉంటుంది. అభిప్రాయ భేదాలతో నిమిత్తం లేకుండా ఈ సంకల్పాన్ని మనం గౌరవించడం నేర్చుకోవాలి. అప్పుడే మానవత్వాన్ని నిలబెట్టగలుగుతాం. అంతే కాదు, అప్పుడే తెలంగాణను కాపాడగలుగుతాం.

ఉత్తర తెలంగాణ ఈ రోజు ఒక విషమ స్థితిని ఎదుర్కుంటూ ఉంది. ప్రభుత్వానికీ నక్సలైట్లకూ మధ్య అదొక 'యుద్ధభూమి'గా మారిపోయింది అనడం కొంత మేరకు మాత్రమే అతిశయోక్తి. ప్రజల జీవితం ప్రజల చేతుల నుండి జారిపోయిందనడం కూడ కొంతమేరకు వాస్తవమే. ప్రజలు ప్రభుత్వాన్నీ 'అన్నల'నూ ఒకే రకంగా చూడరు. ఒకే మోతాదులో గౌరవించరు, ప్రేమించరు. (ప్రభుత్వాన్ని ఉత్తర తెలంగాణలోనే కాదు ఎక్కడా ప్రజలు పెద్దగా గౌరవిస్తున్నట్టుగానీ అసలు ప్రేమిస్తున్నట్టు గానీ కనిపించదు.) అయినప్పటికీ 'ఇద్దరి మధ్యా ప్రజలు నలిగిపోతున్నారు' అనేది అన్ని సందర్భాలలోనూ అబద్ధం కాదు.

తెలంగాణ ప్రజల మనోభావాల్ని శోధిస్తే అందులో కనిపించేది విప్లవ రచయితలు ఊహించే 'పోరాట చైతన్యం' కాదు (ఎప్పుడో కొన్ని సందర్భాలలో తప్ప). కొంత ఉత్సాహం, కొంత ఆశ, కాగల కార్యం గంధర్వులు తీరుస్తారన్న సంతృప్తి కొంత, ఎటుపోయి ఎటువస్తుందో నన్న భయం కొంత, 'మా చేతిలో ఏం లేదు' అనే నిర్లిప్తత కొంత, 'ఇదంతా ఎందుకోసం?' అనే సందేహం కొంత, విరక్తి కొంత. దీనంతటినీ కలిపి టోకున 'పోరాట చైతన్యం' అనీ, 'ప్రజల ప్రతిఘటనా చైతన్యం' అనీ పేరు పెట్టడం దుస్సాహసం అవుతుంది.

ఈ యుద్ధరంగం మళ్లీ జీవన రంగంగా మారాలి. దానిని మార్చుకోవడానికి చైతన్యవంతమైన కృషి కావాలి. 'నాకెందుకొచ్చింది' అనుకోని చొరవ కావాలి. సంకల్పం కావాలి. అవి తగిన మోతాదులో ముందుకు రాకపోతే ఉత్తర తెలంగాణకు ప్రస్తుత పరిస్థితి నుండి విముక్తి లేదు.

ఇందుకు భిన్నంగా, ఉత్తర తెలంగాణలో జీవితమే యుద్ధంగా మారిందని నమ్మేవాళ్లున్నారని నాకు తెలుసును. వాళ్ల దృష్టిలో బహుశా ఇప్పుడు కావలసింది యుద్ధం చేసే తెగింపు ఇంకొంచెం పెరగడం మాత్రమే. ఇది వాస్తవికమైన అభిప్రాయం అని నేను అనుకోవడం లేదు. ఇక్కడ జీవితమే యుద్ధంగా మారలేదు. జీవితంపైన యుద్ధం తన పాదం మోపింది. అయితే అది జీవితంతో సంబంధం లేని యుద్ధం కాదు. అయినప్పటికీ అది 'జీవన యుద్ధం' కాదు. జీవితం కోసం యుద్ధం చేయాలని తెలంగాణ ప్రజలలో ఎక్కువ మంది అనుకోకముందే యుద్ధం వచ్చేసింది. మొదలయిన ఆ యుద్ధం ప్రజలకు ఆ సంకల్పం నేర్పించాలని ఆశిస్తూ ఉంది. అది ప్రజల జీవితాలతో సంబంధం లేని యుద్ధం కాదు కాబట్టి ప్రజలు దానిలో ఏదో ఒక మేరకు భాగస్వాములు అవుతున్నారు. ఇష్టంగా కొందరు, అయిష్టంగా కొందరు, ఇష్టం అయిష్టం కలిసిన సందిగ్ధ స్థితిలో కొందరు తెలంగాణ పేద ప్రజానీకం దానిలో భాగం అవుతున్నారు. అది తప్ప వేరే జీవితం తెలియని తరం ఒకటి తయారవుతున్నది. ఈ యుద్ధం ఆదర్శాల కంటే దాని బలప్రయోగ సామర్థ్యానికి ఎక్కువగా ఆకర్షితులవుతున్న తరం ఇప్పటికే తయారయింది. ఆ సామర్థ్యానికి సలాం కొట్టి తమ స్వప్రయోజనాలు సాధించుకునే అవకాశవాద మూక కూడ తయారయింది.

ఈ స్థితిలో తెలంగాణకు అవసరమైన చొరవ చాలా సంక్లిష్టమైనది. ఇప్పుడు వినిపిస్తున్న రెండు గొంతులే కాక మూడవ గొంతు, నాల్గవ గొంతు, నూరవ గొంతు వినిపించడం మొదలు కావాలి. మునీర్ 'రవ్వంత సానుభూతి, ఆలోచన' కోరుకున్నాడు. మునీర్ ఒప్పుకున్నా ఒప్పుకోకున్నా తెలంగాణ పరిస్థితి అంతకంటే ఎక్కువే కోరుకుంటుందని నేను అనుకుంటున్నాను. ఆ దిశగా ఈ కథా చిత్రాలు మిమ్మల్ని ఆలోచింపజేస్తే సంతోషం.

*అముద్రితం*

*21 అక్టోబర్ 1997*

*మంచిర్యాల విలేఖరి ఎండి మునీర్ పుస్తకానికి ముందుమాటగా రాశారు కాని ఆ పుస్తకం అప్పట్లో అచ్చు కాలేదు. మరికొన్ని వ్యాసాలతో కలిపి 'అమ్మా... తుఝే సలామ్' పేరుతో అది 2011లో ఈ ముందుమాట లేకుండానే అచ్చయింది.*